క్లుప్తంగా

ఆహ్వానపత్రం అందజేత



మైనంపల్లికి ఆహ్వానపత్రం అందిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఈనెల 27 నుంచి ప్రతిష్టాత్మకరంగా ప్రారంభం కానున్న పెద్దమ్మ ఉత్సవాలకు హాజరు కావాలని మైనంపల్లి హన్మంతరావుకు ముదిరాజ్ కులసంఘం సభ్యులు సోమవారం ఆహ్వానపత్రం అందజేశారు. ఈమేరకు కులసంఘం ప్రతినిధులు హైదరాబాద్‌లోని మైనంపల్లి నివాసంలో ఆయనను కలిసి ఆహ్వానించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నేత పోచయ్య, సంఘం ప్రతినిధులు సర్వయ్య, దేవుని నరిసంలు, నరేశ్, భూమ రమేశ్, తదితరులున్నారు.

పోలీసుల కవాతు



టేక్మాల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీస్‌ఫోర్స్‌తో సోమవారం టేక్మాల్ మండలంలోని పల్వంచ, ఎల్లుపేట గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం సీఐ రేణుక మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించరాదన్నారు. ఎన్నికల్లో ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇందులో టేక్మాల్ ఎస్‌ఐ మురళి, అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న ఆలయ వార్షికోత్సవాలు



మల్లన్న దేవాలయం వద్ద బోనాలతో మహిళలు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని కేతకీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ 8వ వార్షికోత్సవాలను సోమవారం యాదవ సంఘం సభ్యులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామికి మల్లన్న కల్యాణం నిర్వహించి, అగ్నిగుండాలు తొక్కారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి, తమ మొక్కులను చెల్లించుకున్నారు.

కనుల పండువగా మల్లన్న జాతర



గుండ్లపల్లి జాతరలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గుండ్లపల్లి, ఎదుల్లాపూర్ గ్రామాల్లో మల్లన్న జాతర కనుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులను, నాయకులను సన్మానించారు. ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, నాయకులు రమణగౌడ్, చంద్రగౌడ్, హన్మంత్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, పూల అర్జున్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): ఆరోగ్యం బాగాలేక తల్లిగారింటికి వచ్చిన మహిళ ఇంట్లోంచి వెళ్లిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూచారం గ్రామానికి చెందిన ముత్తిగల్ల రాములు తన చిన్న కూతురు నందినిని మూడు నెలల క్రితం శివ్వంపేట బిజిలీపూర్ గ్రామానికి చెందిన ఉపేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా 20 రోజుల క్రితం నందిని ఆరోగ్యం బాలేక తల్లిగారింటికి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 16న తన కూతురు కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తన ఫోన్ స్వీచ్ ఆఫ్ వస్తుందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదింతల ఉత్సాహంతో..

జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు ఉత్సాహంగా వచ్చి హాల్ టికెట్లను చూసుకొని పరీక్ష రాయడానికి వెళ్లారు. జిల్లా అధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



పాపన్నపేట(మెదక్): పరీక్షల హాల్‌కు వెళ్లే ముందు విద్యార్థులను స్క్రీనింగ్ చేస్తున్న సిబ్బంది



తూప్రాన్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



శివ్వంపేట పరీక్ష కేంద్రం వద్ద ..



నిజాంపేటలో ..



పెద్దశంకరంపేటలో విద్యార్థుల హాల్‌టిక్కెట్‌ల పరిశీలన

హరితహారం చెట్ల నరికివేత



మల్కాపూర్‌కు వెళ్లే దారిలో నరికిన హరితహారం చెట్లు

పెద్దశంకరంపేట(మెదక్): గత ప్రభుత్వంలో హరితహారంలో భాగంగా నాటిన చెట్లను విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్నాయని విద్యుత్‌శాఖ సిబ్బంది నరికివేశారు. పెద్దశంకరంపేట నుంచి మల్కాపూర్ వెళ్లే దారిలో వృక్షాలు రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణికులను కనువిందు చేస్తున్నాయి. ఇలా ఎన్నో నిధులు ఖర్చు చేసి పెంచిన వృక్షాలను విద్యుత్ అధికారులు నరికివేశారు. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాల్సిన అధికారులు చెట్లను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రజలు, ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



కొడిపల్లి(నర్సాపూర్): పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత

కొడిపల్లి(నర్సాపూర్): గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి తెలిపారు. పోషణ్ పక్వాడలో భాగంగా సోమవారం కొడిపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. తల్లి బిడ్డ ఆరోగ్యం కోసం తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా పోషకాహారం పాలు, కోడిగుడ్డుతో పాటు ఆరోగ్యలక్ష్మి పథకంలో ఒక్కపూట పూర్తి స్థాయి భోజనం పెడుతామని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనతను నివారించుకోవాలని చెప్పారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళలు సరైన పోషకాహారం భుజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు, రక్తహీనత భారీన పడకుండా ఉంటారని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత (గర్భం దాల్చిన నుంచి బిడ్డపుట్టిన రెండు సంవత్సరాల కాలం) గురించి వివరించామన్నారు. చిరుధాన్యాలు, న్యూట్రిషన్ ఫుడ్ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ఎలా తయారు చేసుకోవాలో సూచించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నిధులు కేటాయించడంలో వివక్ష చూపెట్టారని పలువురు బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. కౌన్సిలర్లు సురేశ్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరిలతో పాటు బీజేపీ నాయకుడు రమేశ్‌యాదవ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్‌కు నిధులు కేటాయించడంలో వివక్షకు పాల్పడ్డారని అందరికి నిధులు సమంగా కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... పట్టణంలోని 2, 4, 5, 10, 11, 13 వార్డులకు టీయూఎఫ్ఐడీసీ నుంచి వచ్చిన నిధుల కేటాయించడంలో వివక్ష చూపించారని ఆరోపించారు. తమ వార్డులకు నిధులు కేటాయించకుండా ఇతర వార్డుల్లో అవసరం లేని పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారని అన్నారు. తమ వార్డుల్లో అత్యవసరమైన పనులకు నిధులు కావాలని కోరినా.. కేటాయించకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. తర్వాత జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని నాయకులు సురేశ్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి, రమేశ్‌యాదవ్ చెప్పారు.

చున్నీని అనుమతించని విద్యాధికారులు



చిన్నశంకరంపేటలో చున్నీలు లేకుండా పరీక్షల కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

చిన్నశంకరంపేట(మెదక్): పదవ తరగతి పరీక్షల కేంద్రానికి విద్యార్థినుల చున్నీలను రాగా విద్యాధికారులు అనుమతించలేదు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల కేంద్రం వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో విద్యార్థులు పరీక్షల కేంద్రం వద్ద నుంచి వెనక్కువచ్చి తమ కుటుంబ సభ్యులకు చున్నీలను ఇచ్చి, పరీక్ష రాయడానికి వెళ్లారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు చున్నిలు అనుమతించకపోవడం ఎంటని విస్మయానికి గురయ్యారు. ఇదే విషయంపై జెడ్పీపాఠశాల చీఫ్ ఎగ్జామీనర్ రవీందర్‌రెడ్డిని ప్రశ్నించగా, ఉన్నత అధికారుల నుంచి తమకు అందిన సూచన మేరకు చున్నీలను నిరాకరిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సింలుతో పాదయాత్రలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన పైనం నర్సింలు 2014 ఎన్నికల్లో సునీతారెడ్డి ఓటమి చెందడంతో అప్పటి నుంచి కాళ్లకు చెప్పులు ధరించలేదు. సునీతారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించేంత వరకు చెప్పులు వేసుకోనని శపథం చేశారు. 2024లో ఆమె విజయం సాధించడంతో సోమవారం చెప్పులు ధరించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలనంతరం సిద్దిపేట జిల్లా నాచారంగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్దకు పాదయాత్రగా నర్సింలు బయలుదేరగా ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. స్వామివారి దర్శనం అనంతరం నర్సింలు చెప్పులు ధరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు చంద్రగౌడ్, కల్లూరి హన్మంత్‌రావ్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, పాండురంగం, సందీప్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఆసిఫ్, ముస్కాన్, అజిత్ ఆదివారం మెదక్ పట్టణానికి వచ్చి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. స్కూటీని అతివేగంగా నడుపుతున్న అజిత్ కిష్టాపూర్ గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అజిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరిని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. మృతుడు అజిత్ బంధువు సమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశానని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో ఉన్న దివ్యాంగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన దివ్యాంగులకు గృహలక్ష్మి పథకం కింద ఇందిరమ్మ ఇల్లు కట్టివ్వాలని, పెన్షన్ రూ.6వేలకు పెంచాలన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా నాయకురాలు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలకు ఆహ్వానం



ఎస్‌ఐ నవతకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ముదిరాజ్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి గ్రామంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు పెద్దమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను సోమవారం ఎస్‌ఐ నవతకు అందజేశారు. అదేవిధంగా సజావుగా జరిగేలా బందోబస్తు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు స్వామి, సిద్ధిరాములు ఉన్నారు.

బైక్‌ని ఢీ కొట్టిన ఆటో ముగ్గురికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): బైక్‌ని ఆటో ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి శివ్వంపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట చెందిన కర్రె భాస్కర్, ముత్యాలు, శ్రీను బైక్‌పై శివ్వంపేట నుంచి చండికి వెళ్తున్న క్రమంలో శివ్వంపేట-ఎదుల్లాపూర్ ప్రధాన రోడ్డుపై వీరి బైక్‌ని ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్ కాలు విరగడంతో పాటు పలు చోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే మద్దతు

ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి



వెల్దుర్తి(తూప్రాన్): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ సంఘం జాతీయ నాయకుడు మాసాయిపేట యాదగిరిమాదిగ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా మాసాయిపేటలో మాట్లాడుతూ.. ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్నా.. వర్గీకరణ చేపట్టకుండా మోసం చేసిందన్నారు. కానీ ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణకు పూర్తి మద్దతు ప్రకటించారన్నారు. అదేవిధంగా సుప్రీంకోర్టులో ఉన్నత కమిటీ ఆధ్వర్యంలో వర్గీకరణపై ప్రధాని మోదీ చొరవ చూపారని గుర్తుచేశారు. ఈ క్రమంలో మాదిగలకు, ఉపకులాల బిడ్డలకు భవిష్యత్ దృష్ట్యా కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తేనే వర్గీకరణ ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

'ఎంపీఓపై దాడి చేయడం సరికాదు'



నర్సాపూర్: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ సెక్రటరీలు



టేక్మాల్‌లో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న అధికారులు

నర్సాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొండేరు ఎంపీఓ శ్రవణ్‌కుమార్‌పై దాడి చేయడం సరికాదని ఎంపీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ మధులత, పంచాయతీ సెక్రటరీలతో కలిసి లంచ్ బ్రేక్ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మండల ప్రజా పరిషత్తు కార్యాలయ ఆవరణలో కొండేరు ఎంపీఓపై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండేరు ఎంపీఓ శ్రవన్‌కుమార్‌పై ఎంపీపీ అధ్యక్షురాలు కొండా రాధ దాడి చేయడాన్ని తమ యూనియన్ ఖండిస్తుందన్నారు. కొండేరు ఎంపీఓకు అండగా ఉంటుందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో పంచాయతీ అధికారుల నిరసన

కొల్చారం(నర్సాపూర్): మండల పంచాయతీ అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి లక్ష్మీనర్సింలు మాట్లాడుతూ.. ఇలాంటి అవమానకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడ్డ ఎంపీపీపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మండల పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, శ్రీనివాసులు, మహేశ్, పోచయ్య, నాగరత్నం, రాజేందర్, స్వాతిప్రియ, మమత, సంధ్య, అరుంధతి, విఠల్, ఫణీంద్ర పాల్గొన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో పంచాయతీరాజ్ సిబ్బంది విరామ సమయంలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రియాజొద్దీన్, సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చక్రధర్, గ్రామకార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు నర్సింలు, పాషా, సవిత, అఫ్జల్, నాగరాజు తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ, మండల పరిషత్ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

చిన్నశంకరంపేట(మెదక్): కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. సోమవారం మండలంలోని బీమ్‌రావుపల్లికి చెందిన నగునూరి సువర్ణ నివాసంలో నిర్వహిస్తున్న కిరాణంలో అక్రమంగా నిల్వచేసిన 47 బీర్లు, 28 విస్కి క్వార్టర్స్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మోహినోద్దీన్ తెలిపారు. కేసు నమోదు చేసీ దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన పేదింటి పెళ్లికి కేహెచ్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ హన్మంత్‌రావు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన సుగుణ బాల్‌రాజ్ కుమారుడు పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.75 వేల అందజేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలనే ముందుకు వెళ్తున్నట్లు హన్మంత్‌రావు తెలిపారు.